సమయానికి ఇఎంఐలు కట్టలేకపోతున్నాం

బ్యాంకు మేనేజర్లకు కలెక్టరేట్ ఉద్యోగుల వినతి

భీమవరం: ప్రతి నెలా ఒకటో తేదీకి జీతాలు బ్యాంకు ఖాతాలో వేయకపోవడం వల్ల సమయానికి ఇఎంఐలు కట్టలేకపోతున్నామని, ఈ నేపథ్యంలో ప్రతినెలా సివిల్ స్కోర్ తగ్గిపోతోందని భీమవరం కలెక్టరేట్ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎపి జెఎసి అమరావతి జిల్లా నాయకత్వం ఆధ్వర్యంలో రెండో దశ ఉద్యమంలో స్టేట్ బ్యాంకు, యునియన్ బ్యాంకు మేనేజర్లకు గురువారం వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జెఎసి అమరావతి జిల్లా అధ్యక్షులు ఎస్.శివశంకర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఒకటో తేదీన జీతాలు తమ బ్యాంకు ఖాతాలో జమచేయకపోవడం వల్ల సివిల్ స్కోర్ తగ్గిపోతోందన్నారు. దీంతో ఇతర లోన్ తీసుకోవాలన్నా ఇబ్బంది కలుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఫణి, కలెక్టరేట్ ఎఒ వై.దుర్గాకిశోర్, కార్యాలయ సీనియర్ సహాయకులు వివి.పెద్దిరాజు, పి.జగన్మోహన్, సిబ్బంది, బుజ్జియ్య, బోడపాటి మురళీకృష్ణ, సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

కాలనీలపై కలవరం..!

జెడ్‌పి సమావేశంలో ఇళ్లస్థలాల సమస్యపై స్థానిక ప్రజాప్రతినిధులు ఏకరువు

లేఅవుట్‌ల్లో పూడిక, రోడ్లు, డ్రెయినేజీ సమస్యలపై ఆవేదన

కోర్టులో ఉన్న స్థలాల సమస్యపై అసంతృప్తి

ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి పనిచేయాలి: కలెక్టర్

పలు తీర్మానాలను ప్రవేశపెట్టిన జెడ్‌పి చైర్మన్ కవురు

తూతూమంత్రంగా సాగిన జెడ్‌పి సర్వసభ్య సమావేశం

కవురుకు అధికారులు, ప్రజాప్రతినిధుల వీడ్కోలు, శుభాకాంక్షలు

మాట్లాడుతున్న జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జగనన్న కాలనీల్లో నెలకొన్న ఇళ్లస్థలాల పూడిక, రోడ్లు, డ్రెయినేజీ, తాగునీరు వంటి సమస్యలను పరిష్కరించాలని జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్ అధ్యక్షతన గురువారం జరిగిన ఉమ్మడి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో జెడ్‌పిటిసిలు, ఎంపిపిలు ఏకరువు పెట్టారు. 60, 70 శాతం ఇళ్లు పూర్తయిన కాలనీల్లోనూ రోడ్లు, డ్రెయిన్ల సమస్యలు పరిష్కరించలేదన్నారు. పట్టాలిచ్చి కోర్టులో ఉన్న స్థలాల సమస్యను వెంటనే పరిష్కరించకపోతే లబ్ధిదారుల నుంచి తీవ్ర ఇబ్బందులు వస్తున్నాయన్నారు. కైకలూరు నియోజకవర్గంలో 43 లేఅవుట్ల పూడిక ఇప్పటికీ జరగలేదన్నారు. అనంతరం ఏలూరు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ జిల్లాలో నాడు-నేడు తదితర పనుల నాణ్యతను పరిశీలించేందుకు జెడ్‌పిటిసి, ఎంపిపి, తహశీల్దారు, ఎంపిడిఒలతో కూడిన బృందం ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలన్నారు. మధ్యాహ్నం భోజన పథకం అమలు తీరును, అంగన్వాడీలను పరిశీలించాలని సూచించారు. ఇటువంటి తనిఖీలు నిర్వహిస్తే పనుల్లో మంచి ప్రగతి కన్పించడమే కాకుండా క్షేత్రస్థాయిలో సిబ్బందిలో కొద్ది భయం ఉంటుందని చెప్పారు. కనీసం నెలకు రెండుసార్లు ఈ బృందం తనిఖీలు చేపట్టాలన్నారు. స్పందనలో వచ్చిన ప్రజా సమస్యల పరిష్కారం బాగా జరుగుతుందన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమం చేపడుతున్న సందర్భంలో స్పందనలో పరిష్కార తీరులో అసంతృప్తి ఉంటే తెలియజేయవచ్చని, పరిశీలన అనంతరం సంబంధిత అధికారులపై చర్యలు ఉంటాయని తెలిపారు. స్పందనలో ఎక్కువగా 25 శాతం వ్యక్తిగత భూసమస్యలు వస్తున్నాయని వివరించారు. ఇటువంటి సమస్యలను స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దల ద్వారా పరిష్కారమయ్యేలా చొరవ తీసుకోవాలన్నారు. రబీ ధాన్యం సేకరణకు సంబంధించి ఇప్పటికే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటయ్యాయన్నారు. ఎకరాకు 92 గోనె సంచులు అందిస్తున్నామని, పంటకోత ప్రయోగాల ద్వారా దిగుబడి అంచనా వేసి ఇది నిర్ణయించామని తెలిపారు. వంద సంచులు ఇవ్వాలని డిమాండ్ ఉందని, అయితే రైతులు తమ చేతిలో ఉన్నపంటను ముందుగా ఇచ్చేలా అవగాహనపర్చాలన్నారు. గోనె సంచుల సమస్య లేకుండా చర్యలు తీసుకున్నామన్నారు. రవాణా సౌకర్యానికి సంబంధించి స్థానిక ప్రజాప్రతినిధులు సహకారం అందిస్తే రబీ ధాన్యం సేకరణ సజావుగా పూర్తి చేసేందుకు అన్ని ప్రయత్నాలూ చేస్తామన్నారు. గత ఖరీఫ్‌లో 21 రోజులకే సొమ్ము రైతుల ఖాతాల్లో జమ చేసిన విషయాన్ని గుర్తుచేశారు. వేసవి ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకొని ప్రతి మండలంలో కనీసం 4,5 చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ఎంపిడిఒలు, తహశీల్దార్లకు సూచించామన్నారు. ఉపాధి హామీ కింద పలు ప్రభుత్వ ప్రాధాన్యతా నిర్మాణాలు చేపట్టామని, కొన్ని భవనాలు 95 శాతం నిర్మాణ పనులు పూర్తిచేసుకొని తుదిదశలో ఉన్నాయని, వాటిని పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొచ్చేందుకు స్థానిక ప్రజాప్రతినిధుల చొరవ ఎంతైనా అవసరమన్నారు. జిల్లాలో రీసర్వేపై రైతులకు అవగాహన ఉండాలన్నారు. భూమి వివరాల్లో వ్యత్యాసాలు ఉంటే గ్రామ సభలో తెలియపర్చవచ్చని, రికార్డులో పేరు తప్పు పడితే 21 రోజుల్లో అభ్యంతరాలు తెలిపే అవకాశం ఉందని అన్నారు. గృహనిర్మాణానికి సంబంధించి జిల్లాలో ప్రగతి బాగానే ఉందన్నారు. ప్రతి శనివారం హౌసింగ్ డే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇళ్ల కాలనీల్లో అవసరమైన తాగునీరు, విద్యుత్ సరఫరా పనులు జరుగుతున్నాయన్నారు. సీసీ రోడ్లు, డ్రెయిన్లు, ఇతర మౌలిక సదుపాయాల పనులను ఇళ్ల నిర్మాణ అనంతరం వేగంగా చేపడుతున్నట్లు తెలిపారు.



జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న ఏలూరు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

పలు తీర్మానాలు ఆమోదం

జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్ పలు తీర్మానాలను పెట్టి సభ ఆమోదం కోరారు. జిల్లా పరిషత్ సిబ్బందికి సంబంధించి ఉద్యోగులను, కుటుంబాలను ఆదుకునేందుకు జెడ్‌పి సాధారణ నిధుల నుండి వార్షికంగా రూ.15 లక్షలు ఇన్సూరెన్స్ సొమ్మును కంపెనీకి చెల్లించేందుకు ఆమోదం తెలిపారు. జెడ్‌పి కార్యాలయం నుండి గ్రామ పంచాయతీ పింఛనుదారులు 230 మందికి, జెడ్‌పి పింఛనుదారులు 26 మందికి వెరసి మొత్తం 256 మందికి పింఛను చెల్లిస్తున్నట్లు ఈ ఆర్థిక సంవత్సరం నుండి పింఛను చెల్లింపు నిమిత్తం రూ. ఆరు కోట్లు బడ్జెట్ జెడ్‌పి సాధారణ నిధుల కేటాయించనున్నట్లు తెలిపారు. ఎరియర్ సొమ్ము ప్రభుత్వం నుండి విడుదలయ్యాక పింఛనుదారులకు సొమ్ము చెల్లించుటకు చర్యలు తీసుకుంటామన్నారు. తాను జెడ్‌పి ఛైర్మన్‌గా ఉన్న సమయంలో అన్నివిధాలా ఆదరించి ముందుకు నడిపించిన ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులకు కవురు శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు. ఇదే నా చివరి సమావేశం అని పేర్కొన్నారు. ఏ జిల్లాలో చేయనివిధంగా ప్రతి జెడ్‌పిటిసికి అభివృద్ధి పనులకు రూ.కోటి కేటాయించినట్లు వివరించారు. ఎంఎల్‌సిలు జయమంగళ వెంకటరమణ, షేక్ సాబ్జీ, గోపాలపురం ఎంఎల్‌ఎ తలారి వెంకట్రావు పలు సమస్యలను లేవనెత్తారు. సమావేశంలో జెడ్‌పి సిఇఒ కె.రవికుమార్, పలువురు జెడ్‌పిటిసిలు పాల్గొన్నారు. ఛైర్మన్ కవురు శ్రీనివాస్‌ను శాలువాతో అధికారులు, ప్రజాప్రతినిధులు సత్కరించారు.

జెడ్‌పి అధికారుల రూటే వేరు..

జిల్లాలోని ప్రజా సమస్యల పరిష్కార వేదికగా ఉండాల్సిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహణాతీరును జెడ్‌పి అధికారులు అందుకు విరుద్ధంగా మార్చేశారు. ఏదో సమావేశం పెట్టాలనే రీతిలో తూతుమంత్రంగా నిర్వహిస్తున్న పరిస్థితి నెలకొంది. ఎజెండా అంశాలకు సంబంధించిన కాపీలను సభ్యులకు అందించడం పూర్తిగా వదిలేశారు. గతంలో పుస్తకం రూపంలో ఎజెండా అంశాలు, వివరాలు పొందుపరిచి సభ్యులకు, మీడియాకు ఇచ్చేవారు. గడిచిన రెండు, మూడు సమావేశాల నుంచి దీనికి పూర్తిగా తిలోదకాలు ఇచ్చేశారు. పథకాలకు సంబంధించిన సమాచారం తెలియకుండా ఈ విధంగా చేస్తున్నారా అనే అనుమానాలు నెలకొన్నాయి. వారు చెప్పిందే ఎజెండా అన్నట్లు తయారైంది. ఎజెండాలో పేర్కొన్న ఒకటి, రెండు అంశాలకే సభ పరిమితమవుతోంది. గతంలో జెడ్‌పి సమావేశానికి మంత్రులు, ఎంఎల్‌ఎలంతా హాజరయ్యేవారు. గత కొన్ని సమావేశాలనుంచి మంత్రులు, ఎంఎల్‌ఎలు కనీసం రావడం లేదు. పశ్చిమగోదావరి జిల్లా నుంచి కలెక్టర్‌గాని, జెసిగానీ రాకపోవడంపై సభ్యులుసైతం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన పరిస్థితి ఉంది. గురువారం సమావేశానికి గోపాలపురం ఎంఎల్‌ఎ తలారి వెంకట్రావు, ఎంఎల్‌సిలు షేక్ సాబ్జీ, జయమంగళ వెంకటరమణ మాత్రమే హాజరయ్యారు. మధ్యాహ్న భోజనం అనంతరం సమావేశం జరుగుతుందని, సమస్యలపై చర్చలు ఉంటాయని చెప్పడంతో సభ్యులంతా వచ్చి ఆశీనులయ్యారు. అయితే సమావేశం జరగలేదు. కనీసం సభ్యులకు సమాచారం కూడా ఇవ్వకపోవడంపై అంతా అసహనం వ్యక్తం చేశారు. జెడ్‌పి సమావేశం తీరుతెన్నులను పూర్తిగా మార్చేస్తున్న జెడ్‌పి అధికారుల తీరు సభ్యుల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.



విస్సాకోడేరులో సచివాలయ భవనాన్ని ప్రారంభించిన మంత్రి జోగి రమేష్, ప్రభుత్వ చీఫ్‌విప్ ప్రసాద్ రాజు డిసిసిబి చైర్మన్ పివిఎల్ నరసింహరాజు

పొత్తుల్లేకుండా పోటీ చేసే దమ్ముందా

చంద్రబాబుకు మంత్రి జోగి రమేష్ సవాల్

ప్రజాశక్తి - పాలకోడేరు

ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడుకు పొత్తులు లేకుండా పోటీ చేసే దమ్ముందా అని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ సవాల్ విసిరారు. విస్సాకోడేరులో నిర్మించిన సచివాలయం ప్రారంభోత్సవానికి వచ్చిన మంత్రి జోగి రమేష్, ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు, డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజుకు సర్పంచి బొల్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. స్థానిక గోపీకృష్ణ థియేటర్ నుంచి సచివాలయం వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు. సచివాలయం వద్ద వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సచివాలయ భవనాన్ని ప్రారంభించిన మంత్రి జోగి రమేష్ సర్పంచి బొల్ల శ్రీనివాస్‌ను అభినందించారు. సర్పంచి శ్రీనివాస్, మాజీ సర్పంచి పెనుమత్స శ్రీనివాసరాజు, వైసిపి ముఖ్య నేత దండి అశోక్ బాబు మంత్రి రమేష్‌కు, ప్రసాద్ రాజు, పివిఎల్‌కు వారి ఫొటోతో కూడిన జ్ఞాపకను అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి గురించి ఇటీవల ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు ఇష్టం వచ్చినట్లు మాట్లాడడాన్ని తప్పుబట్టారు. విస్సాకోడేరు నుంచి చంద్రబాబుకు సవాల్ చేస్తున్నానన్నారు. 175 స్థానాల్లో టిడిపి అభ్యర్థులను నిలబెట్టే దమ్ము, ధైర్యం లేని చంద్రబాబునాయుడు 175 స్థానాల్లో మమ్మల్ని ఓడిస్తారా అని ప్రశ్నించారు. ఒక పక్క పొత్తుల కోసం పాకులాడే చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్‌తో బేరాలు కుదుర్చుకుని ఆయనకు 40 సీట్లు, సిపిఐ, సిపిఎంలకు చెరో ఐదారు, కొత్తగా కాంగ్రెస్ పార్టీతో జతకలిసి ఆ పార్టీకి ఐదారు సీట్లు ఇచ్చేందుకు బేరాలు కుదుర్చుకుంటున్నారని విమర్శించారు. ఎంత మంది కలిసికట్టుగా వచ్చినా చిత్తుచిత్తుగా ఓడిస్తామన్నారు. 2024లో 151 స్థానాల కంటే ఎక్కువ స్థానాలను గెలుచుకుంటామన్నారు. అనంతరం ఫోన్ నెంబర్ పేటలో జగనన్న కాలనీలో నూతనంగా నిర్మించిన గృహాలను డిసిసిబి ఛైర్మన్ నరసింహరాజు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి భూపతి రాజు సత్యనారాయణ రాజు (చంటి రాజు), ఎంపిటిసిలు బొల్లం గాంధీ, పేదపూడి లక్ష్మీపతి, కో ఆప్షన్ సభ్యులు డిఆర్ స్వర్ణలత, ఉప సర్పంచి కందుల నాగరాజు, ఆర్‌డిఒ దాసిరాజు పాల్గొన్నారు.

మంత్రి రమేష్‌ను నిలదీసిన పెదకాపవరం గ్రామస్తులు

ఆకివీడు : మండలంలో గురువారం పలు ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్‌ను పెదకాపవరం గ్రామస్తులు చుట్టుముట్టారు. ఇళ్ల స్థలాలు ఏవీ అంటూ ప్రశ్నించారు. మంత్రి మండలంలో పలు కార్యక్రమాల్లో పాల్గొని చివరగా పెదకాపవరం వచ్చారు. గ్రామంలో రూ.45 కోట్ల నిధులతో కొల్లేరు నుండి భీమవరం వెళ్లే రోడ్డు, పెదకాపవరం నుండి భీమవరం వెళ్లే 12 కిలోమీటర్ల రోడ్డు, కలవపూడి - గణపవరం రోడ్డు నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. అక్కడ నుండి ఆయన సభా ప్రాంగణానికి వెళ్లారు. ఈ క్రమంలో ఒక్కసారిగా గ్రామస్తులు చుట్టుముట్టారు. తమకు ఇప్పటివరకూ ఇల్లు ఇవ్వలేదని, ఇళ్ల స్థలాలు లేవని తెలిపారు. స్థలాలు లేకుండా ఇల్లు ఉన్నాయా అని ఎలా అడుగుతున్నారని ప్రశ్నించారు. వెంటనే తహశీల్దార్, విఆర్‌లను పిలిచి స్థలాలు, ఇల్లు లేని వారి జాబితా తయారు చేయాలని ఆదేశించి అక్కడ నుంచి వెళ్లిపోయారు.

ఆకివీడు : మంత్రిని నిలదీస్తున్న పెదకాపవరం గ్రామస్తులు

ఉదయం ఏలూరు జిల్లా సరిహద్దు ఉప్పుటేరు వద్ద మంత్రి పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడులో ప్రవేశించారు. ఆయనకు కార్యకర్తలు, ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు, డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజు, పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. గజమాలతో ఆయనను సత్కరించారు. అక్కడ నుండి ర్యాలీగా అయిభీమవరం మీదుగా తాళ్లకోడిలోని జగనన్న కాలనీకి చేరి ఇళ్లను పరిశీలించారు. అనంతరం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించారు. అక్కడి కోళ్లపర్రు వెళ్లి సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. కోళ్లపర్రులో జరిగిన ప్రారంభోత్సవంలో టిడిపి ఎంఎల్‌ఎ మంతెన రామరాజు పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ సభ్యులు వేగేశ్న వెంకటరాజు (ఎండగండి శీను), నగర పంచాయతీ ఛైర్‌పర్సన్ జామి హైమావతి, ఎంపిపి కటారి రాజ్యలక్ష్మి, రూరల్ బ్యాంక్ ఛైర్ పర్సన్ కేసిరెడ్డి మురళి, జిల్లా కలెక్టర్ ప్రశాంతి, ఆర్‌డిఒ దాసి రాజు పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్ : మండలంలోని సగంచెరువు గ్రామం వద్ద గురువారం 216 జాతీయ రహదారి అనుకొని, నరసాపురం పాలకొల్లు ప్రధాన కాలువపైన రూ.10 కోట్లతో నిర్మించిన వంతెనను ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు, జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్‌తో కలిసి రాష్ట్ర గహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఎక్కువ నిధులు ఖర్చు చేసి అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారన్నారు. ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు టిడిపి హయాంలో రూ.10 కోట్లతో తాను శంకుస్థాపన చేశానని, ఎట్టకేలకు పూర్తి చేయగలిగారని తెలిపారు. సగం చెరువు పరిసర గ్రామ ప్రజలకు ఈ వంతెన వల్ల ఎంతో లబ్ధి చేకూరుతుందని తెలియజేశారు.

కార్యకర్తల మధ్య వాగ్వివాదం

వంతెన ప్రారంభోత్సవం సందర్భంగా టిడిపి, వైసిపి కార్యకర్తల మధ్య చిన్నపాటి వాగ్వివాదం జరిగింది. రామానాయుడు ప్రారంభోత్సవానికి రాకుండా వైసిపి కార్యకర్తలు అడ్డుకున్నారు. డిఎస్‌పి కలుగజేసుకుని రామానాయుడుని సముదాయించారు. ఈ కార్యక్రమంలో ఎంబిసి ఛైర్మన్ పెంద్ర.వీరన్న, రాష్ట్ర ఎస్‌సి కమిషన్ సభ్యులు చెల్లెం.ఆనంద్ ప్రకాష్, మాజీ ఎంఎల్‌సి మేకా శేషుబాబు పాల్గొన్నారు.

బిజెపి పాలనలో దేశం అధోగతి

సిపిఎం, సిపిఐ ప్రచార భేరిలో నేతలు

ప్రజాశక్తి - వీరవాసరం

కేంద్రంలో బిజెపి ప్రభుత్వ పాలనలో దేశం అధోగతి పాలైందని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం విమర్శించారు. సిపిఎం, సిపిఐ ప్రచార భేరి యాత్ర ముగింపు సభ ఆ పార్టీ మండల కన్వీనర్ పోతుల మృత్యుంజయ అధ్యక్షతన గురువారం నవుడూరు సెంటర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా బి.బలరాం మాట్లాడుతూ మోడీ అధికారంలోకి వచ్చి తొమ్మిదేళ్లు గడుస్తున్నా ప్రజల సమస్యలు రోజురోజుకీ పెరుగుతున్నాయన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రధాన అస్త్రలుగా ఉపయోగించి బిజెపి అధికారంలోకి వచ్చిందన్నారు. అయితే కాంగ్రెస్ పాలనకన్నా బిజెపి పాలన దేశాన్ని మరింత దిగజార్చిందన్నారు. నిత్యం పెరుగుతున్న ధరలతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. మరోవైపు కార్మికులు, రైతులు, సామాన్య, మధ్యతరగతి ఉద్యోగులు, ప్రజల హక్కులను కాలరాసేలా చట్టాలు తీసుకొచ్చిందన్నారు. రైతుల ఆదాయం రెట్టింపు చేస్తానన్న మోడీ రైతుల ఆత్మహత్యలు రెట్టింపు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేస్తూ కార్పొరేట్ సేవలో బిజెపి ప్రభుత్వం మునిగిపోయిందన్నారు. రాష్ట్ర విభజన సమయంలో పార్లమెంట్ సాక్షిగా అమలు చేస్తామని చెప్పిన ప్రత్యేక హోదా, విభజన హామీలు, రైల్వేజోన్, కడప ఉక్కు పరిశ్రమ, పోలవరం ప్రాజెక్టు నిధుల విషయాన్ని బిజెపి ప్రభుత్వం పూర్తిగా మర్చిపోయిందన్నారు. రాష్ట్రానికి ఇంత అన్యాయం జరుగుతున్నా రాష్ట్ర ప్రభుత్వం, సిఎం నోరు మెదపడం లేదన్నారు. టిడిపి, జనసేన సైతం కేంద్రం చేస్తున్న అన్యాయంపై కనీసం మాట్లాడటం లేదన్నారు. రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయంపై వామపక్షాలు కేంద్రంపై చేస్తున్న ఆందోళనల్లో మిగిలిన పార్టీలూ కలిసి రావాలని బలరాం కోరారు. సిపిఐ జిల్లా నాయకులు మల్లుల సీతారాంప్రసాద్ మాట్లాడుతూ విదేశాల్లో ఉన్న నల్ల ధనాన్ని తీసుకొచ్చి ప్రతిఒక్కరి ఖాతాలో రూ.15 లక్షలు వేస్తానని చెప్పి జన్‌ధన్ ఖాతాలు తెరిపించి ఒరగబెట్టిందేమీలేదన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జెఎన్‌వి.గోపాలన్ మాట్లాడుతూ ప్రజలపై పెను భారాలు మోపిన బిజెపిని దూరం పెట్టాల్సిన రాష్ట్రంలోని ప్రధాన పార్టీలు ఆ పార్టీని తమ భుజాలపై మోయడం సిగ్గు చేటన్నారు. వచ్చే ఎన్నికల్లో బిజెపితో జతకట్టే పార్టీలను ప్రజలు దూరం పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు జుత్తిగ నరసింహమూర్తి, నేతలు కేతా జ్యోతిబసు, తాళ్లూరి రాము, యండమూరి సుబ్బారావు, పాలా కోటేశ్వరరావు, అయినంపూడి బాబూరావు, యాళ్లబండి నారాయణమూర్తి, లింగం సత్యనారాయణ, తోట నర్సింహరావు, జుత్తిగ సాంబియాంబ, బొంతు రామారావు పాల్గొన్నారు.

తణుకురూరల్: దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని, ప్రజాస్వామ్య పరిరక్షణకు కేంద్రంలో బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం పిలుపునిచ్చారు. సిపిఎం, సిపిఐ రాజకీయ ప్రచారభేరి ముగింపు సభ గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద జరిగింది. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ ఎన్నికల్లో బిజెపి ఇచ్చిన వాగ్దానాలను తుంగలో తొక్కి ప్రజలపై విపరీతమైన భారాలు వేస్తుందన్నారు.



తణుకు : మాట్లాడుతున్న బలరాం

సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు మాట్లాడుతూ బిజెపి అధికారం చేపట్టి తొమ్మిదేళ్లయినా నేటికీ ఏఒక్క వాగ్దానమూ అమలు చేయకుండా దేశాన్ని మోడీ అమ్మేస్తున్నాడని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పివి ప్రతాప్, నేత కామన మునిస్వామి, సిపిఐ జిల్లా నేత బొద్దాని నాగరాజు పాల్గొన్నారు.

పెంటపాడు: ఈ నెల 21న తాడేపల్లిగూడెం ఎన్‌కె గ్రౌండ్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా సిపిఐ, సిపిఎం ఆధ్వర్యాన తలపెట్టిన బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఐ మండల కార్యదర్శి కళింగ లక్ష్మణరావు, సిపిఎం మండల కార్యదర్శి చిర్ల పుల్లారెడ్డి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిరపరపు రంగారావు తెలిపారు. గురువారం రెండోరోజు ప్రచారభేరి నిర్వహించారు. యాత్ర పెంటపాడు నుంచి దర్శిపర్రు, వల్లూరుపల్లి, రాచర్ల, అలంపురం, బోడపాడు, బిల్లగుంట, రావిగుంట, జట్లపాలెం, ఉమామహేశ్వరం, మౌంజిపాడు, పడమర విప్పర్రు మీదుగా పెంటపాడు చేరుకుంది. ఈ కార్యక్రమంలో బంకురు నాగేశ్వరరావు, బోడబల్ల లక్ష్మీనారాయణ, మీసాల శ్రీను, సత్తి మహేష్ రెడ్డి, దిద్దే నాగేశ్వరరావు, పెనగంటి దుర్గ పాల్గొన్నారు.

నరసాపురం రూరల్: ప్రజావ్యతిరేక నిరంకుశ మతోన్మాద బిజెపిని సాగనంపుదాం.. దేశాన్ని కాపాడుకుందాం అనే నినాదంతో జనం కదలాలని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం అన్నారు. సిపిఎం, సిపిఐ రాజకీయ ప్రచారభేరి యాత్ర తూర్పుతాళ్లు, పెదమైనవానిలంక, చినమైనవానిలంక, వేములదీవి ఈస్టు, వేములదీవి వెస్ట్ గ్రామాల మీదుగా సాగింది. వేములదీవి వెస్టులో జరిగిన సభకు సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కవురు పెద్దిరాజు అధ్యక్షత వహించగా బలరాం మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందన్నారు. ప్రతిఒక్కరూ కేంద్ర ప్రభుత్వ దుర్మార్గాలను నిలదీయాల్సిన అవసరం ఉందన్నారు. సభలో సిపిఎం నేతలు ముచ్చర్ల త్రిమూర్తులు, మామిడిశెట్టి రామాంజనేయులు, జల్లి రామ్మోహన్‌రావు మాట్లాడారు.

తాడేపల్లిగూడెం: సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో ప్రచార భేరి యాత్ర గురువారం మండలంలోని వెంకట్రావుపాలెం, నీలాద్రిపురం, కొమ్ముగూడెం, పట్టింపాలెం, వీరంపాలెం, బంగారుగూడెం, కొత్తూరు, ఆరుగొలను, నవాబుపాలెం, పెద్దతాడేపల్లి, రామన్నగూడెం, వెంకట రామన్నగూడెం, కృష్ణయ్యపాలెం, ఆరుళ్ల, మారంపల్లి, నందమూరు గ్రామాల్లో సాగింది. పెదతాడేపల్లిలో ఉపాధి కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు కండెల్లి సోమరాజు, సిపిఐ నాయకులు ఉల్లింకల జయకృష్ణ మాట్లాడారు. కార్యక్రమంలో కండెల్లి రమేష్‌బాబు, ఉల్లింకల బాలకృష్ణ పాల్గొన్నారు.

పెనుగొండ: సిపిఎం ఆధ్వర్యంలో పెనుగొండ ఇందిరాకాలనీలో ప్రచార భేరి నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నేత షేక్ పాదుషా మాట్లాడగా మాదాసు నాగేశ్వరరావు, శీలం ఏసు, గెద్దాడ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం: ప్రజా వ్యతిరేక, నిరంకుశ, మతోన్మాద బిజెపిని సాగనంపుదాం.. దేశాన్ని కాపాడుకుందామనే నినాదంతో పట్టణంలో గురువారం వరుసగా ఏడో రోజు సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో ప్రచార భేరి యాత్ర ఎస్‌వి.రంగారావు విగ్రహం వద్ద నుంచి తాళ్లముదునూరుపాడు వరకు మెయిన్ రోడ్డులో నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, సిపిఐ పట్టణ కార్యదర్శి మండల నాగేశ్వరరావు, సిపిఎం పట్టణ నాయకులు కరెడ్ల రామకృష్ణ మాట్లాడుతూ బిజెపి విధానాలను నిరసిస్తూ శుక్రవారం తాడేపల్లిగూడెంలో పట్టణంలో నిర్వహించనున్న సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జవ్వాది శివ, తోట శ్రీను, షేక్ సాయిబన్, శిద్దిరెడ్డి శేషుబాబు, చిట్టేటి సత్యనారాయణ, పోతు శ్రీను, అల్లం రాము, దాస్యం రాము, రావూరి బాబీ, కోరాడ వెంకటేశ్వరరావు, ఉయ్యూరి సత్యనారాయణ పాల్గొన్నారు.

భీమవరం: యువతకు ఉపాధి అవకాశాలు రావాలంటే కేంద్రంలో బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించాలని సిపిఎం పట్టణ కార్యదర్శి బి.వాసుదేవరావు అన్నారు. సిపిఎం, సిపిఐ ప్రచార భేరి పట్టణంలో గురువారం కొనసాగింది. ఈ సందర్భంగా వాసుదేవరావు, పట్టణ నాయకులు ఎం.వైకుంఠరావు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం తొమ్మిదేళ్ల పాలనలో దేశాన్ని, రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో దివాలా తీయించిందని విమర్శించారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ నాయకులు డి.నాగు, కె.కృష్ణ, చెల్లబోయిన వెంకటేశ్వరరావు, డి.త్రిమూర్తులు, కోదండం శ్రీరాములు, నాగేశ్వరరావు, అంజి, వెంకన్న పాల్గొన్నారు.

పెనుమంట్ర: ప్రజలకు శాపంగా మారిన కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ విధానాలను అంతా వ్యతిరేకించాలని సిపిఎం మండల కార్యదర్శి కూసంపూడి సుబ్బరాజు అన్నారు. గురువారం జుత్తిగలో ప్రచార భేరి నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బరాజు మాట్లాడగా నేతలు మేకపాటి సుబ్బారావు, కర్రి సోమిరెడ్డి, కర్రి సత్యనారాయణరెడ్డి, కొడమంచిలి సాయి, తమనంపూడి సోమిరెడ్డి, పట్నాల భాస్కరరావు, దంపనబోయిన చిరంజీవి, మిర్యాల సూర్యారావు పాల్గొన్నారు.

నేడు తాడేపల్లిగూడెంలో సిపిఎం, సిపిఐ బహిరంగ సభ

హాజరు కానున్న రాష్ట్ర నేతలు

ప్రజాశక్తి - భీమవరం

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 21న శుక్రవారం ఉదయం ఎనిమిది గంటలకు తాడేపల్లిగూడెంలో సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు ఆయా పార్టీల జిల్లా కార్యదర్శులు బి.బలరాం, కె.భీమారావు తెలిపారు. ఈ బహిరంగ సభకు ముఖ్యఅతిథులుగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చిగురుపాటి బాబూరావు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు వారు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ధరలను తగ్గిస్తానని చెప్పి అధికారంలోకొచ్చిన బిజెపి నిత్యం ధరలను పెంచుకుంటూ పోతుందని విమర్శించారు. రాష్ట్రానికి ఇవ్వాల్సిన ప్రత్యేక హోదా, విభజన హామీలు, పోలవరం ప్రాజెక్ట్ నిధులు, పునరావాసం మొదలైన అన్ని విషయాల అమలులో కేంద్రం పూర్తిగా విఫలమైందని పేర్కొన్నారు. వీటిని సాధించడంలో రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలు పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు. వీటన్నింటినీ వివరిస్తూ అంబేద్కర్ జయంతి రోజు నుంచి ప్రచార భేరి పేరిట జిల్లాలో అన్ని మండలాల్లో సిపిఎం, సిపిఐ ఆధ్వర్యాన విస్తృత ప్రచారం నిర్వహించామని తెలిపారు. ఈ ప్రచారం ముగింపు సందర్భంగా తాడేపల్లిగూడెంలో మెయిన్ రోడ్డును ఆనుకుని ఉన్న ఎన్‌కె గ్రౌండ్‌లో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నామని, ఈ సభకు పార్టీ కార్యకర్తలు, శ్రేయోభిలాషులు, ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

తాడేపల్లిగూడెంలో మోటారు సైకిల్ ర్యాలీ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

సిపిఎం, సిపిఐ ప్రచారభేరి యాత్ర ముగింపు సందర్భంగా గురువారం ఎస్‌విఆర్ విగ్రహం వద్ద నుంచి పెంటపాడు వరకు మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కర్రి నాగేశ్వరరావు, సిపిఐ జిల్లా నాయకులు సీతారాం ప్రసాద్ మాట్లాడారు. తాడేపల్లిగూడెంలో శుక్రవారం నిర్వహించే సభను జయప్రదం చేయాలని కోరారు. స్వాతంత్రోద్యమంలో కనీస పాత్రలేని వారు దేశాన్ని పాలించడం సిగ్గుచేటని వారన్నారు. ఆంధ్రుల హక్కు విశాఖ ఉక్కును అమ్మకానికి పెట్టి మోడీ రాష్ట్రానికి తీరని ద్రోహం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి మండల నాగేశ్వరరావు, ఇరుపార్టీల నేతలు మడకా రాజు, కరెడ్ల రామకృష్ణ, శిద్దిరెడ్డి శేషుబాబు, చిట్టేటి సత్యనారాయణ, పోతు శ్రీను, అల్లం రాము, దాస్యం రాము, రావూరి బాబీ, ఉయ్యూరి సత్యనారాయణ పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న సిపిఎం, సిపిఐ నేతలు

కొత్త టెండర్ విధానంతో అన్యాయం

కార్మిక శాఖ కార్యాలయం వద్ద కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - తణుకు రూరల్

ఎపి సీడ్స్‌లో కార్మికుల పట్ల చట్ట విరుద్ధంగా వ్యవహరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పి.వి.ప్రతాప్ డిమాండ్ చేశారు. గురువారం సిఐటియు ఆధ్వర్యంలో కార్మికశాఖ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి, కార్యాలయంలోకి చొచ్చుకెళ్లి నిరసన తెలిపారు. అనంతరం కార్మిక సహాయ అధికారికి-2 వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ టెండర్ విధానంతో కార్మికులకు అన్యాయం జరుగుతుంటే కార్మిక శాఖ పట్టించు కోకపోవడం ఏంటని ప్రశ్నించారు. సీడ్స్ అధికారులు కార్మిక చట్టాలు అమలు చేయకుండా చెప్పుడు మాటలు వినడం సిగ్గు చేటన్నారు. రాష్ట్రంలో 18 యూనిట్లలో లేని దాన్ని తణుకులో కావాలనే కక్షతో పెట్టారన్నారు. ఒక పక్క టెండర్ కంటే ముందుగా కార్మికులు డిమాండ్ నోటీస్ ఇచ్చినప్పుడు చట్ట విరుద్ధంగా ఎలా వెళతారని ప్రశ్నించారు. కార్మికులకు అన్యాయం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బి.శ్రీహరి, త్రిమూర్తులు, టి.రామకృష్ణ, సూరిబాబు, సతీష్, పల్లప.రావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

గోనె సంచులివ్వాలని వినతి

కాళ్ల: ఆరు కాలం కష్టపడి రైతు పండించిన పంటను అమ్ముకునేందుకు రైతులను నానా ఇబ్బందులకు గురి చేయడం దుర్మార్గమని సిపిఎం మండల కార్యదర్శి గొర్ల రామకృష్ణ అన్నారు. కోపల్లె, బొండాడ, బొండాడపేట, జక్కరం, చినపుల్లేరు గ్రామాలకు చెందిన కౌలు రైతులు గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయానికి చేరుకుని రెవెన్యూ అధికారులకు సంచుల సమస్యను వివరించారు. ధాన్యం మాసూళ్లు చేసి 20 రోజులు గడుస్తున్నా ప్రభుత్వం సంచులు ఇవ్వక ధాన్యం కళ్లాల్లోనే పెట్టుకుని రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన తహశీల్దార్ వెంటనే సంచులు అందించే ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ సంచులు ఇవ్వకపోతే శుక్రవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అనంతరం కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ నాగమణికి వినతిపత్రం అందజేశారు.

గ్రామ సమస్యలపై పోరాడండి

ఎంఎల్ఎ మంతెన రామరాజు

ఉండి: నిరంతరం ప్రజల్లోనే ఉంటూ గ్రామ సమస్యలపై పోరాడాలని కలిసిపూడి గ్రామ నూతన కమిటీకి ఎంఎల్ఎ మంతెన రామరాజు సూచించారు. గురువారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఎంఎల్ఎ రామరాజును కలిసిపూడి గ్రామ కమిటీ అధ్యక్షుడు భూపతిరాజు సూర్యనారాయణ రాజు, ప్రధాన కార్యదర్శి కేసబోయిన కొండలరావు, ఉపాధ్యక్షులు బీడెల్లి చంద్రశేఖర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంతెన రామరాజు మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు కరిమెరక నాగరాజు, పొత్తూరి వెంకటేశ్వరరాజు, కాగిత మహంకాళి, జుత్తిగ శ్రీనివాస్ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తత అవసరం

పాలకొల్లు: అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ శేషాద్రి నాయుడు సూచించారు. పాలకొల్లులో గురువారం జరిగిన అగ్ని మాపక వారోత్సవాల ముగింపు సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వారం రోజులుగా వివిధ రంగాలవారికి అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

పెనుమంచిలిలో మజ్జిగ చలివేంద్రం

ప్రజాశక్తి - ఆచంట

వేసవి నేపథ్యంలో బాటసారుల దాహార్తిని తీర్చేందుకు మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు సర్పంచి గణేశుల శేషవాణి సుబ్బారావు అన్నారు. గురువారం పెనుమంచిలిలో మజ్జిగ చలివేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. వడగాల్పులు ఎక్కువగా వీచే అవకాశం ఉందని, ప్రయాణికులు, గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, విఆర్ఒలు పాల్గొన్నారు.

ఆకివీడు : వేసవిలో చలివేంద్రాలు ఎందరికో దాహార్తిని తీరుస్తాయని ప్రముఖ చిన్న పిల్లల వైద్యులు డాక్టర్ కుమార్ అన్నారు. డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం స్థానిక రైల్వే గేటు వద్ద జోహార్ పేటలో మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ చలివేంద్రాన్ని ప్రతాప్ కుమార్ ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గేదెల ధనుష్, కోశాధికారి డోకల రవితేజ, బి.రాంబాబు, లింగాల బలరాం, కె.మోహన్ కృష్ణ పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం

కాళ్ల: సమాజ సేవతోనే నిజమైన సంతృప్తి లభిస్తుందని, ఏలూరుపాడు లయన్స్ సేవలు అభినందనీయమని లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ వికె.పంకజాక్షన్ అన్నారు. ఏలూరుపాడులో లయన్స్ క్లబ్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి లయన్స్ క్లబ్ అధ్యక్షులు మంతెన వెంకట రవివర్మ అధ్యక్షత వహించారు. పదేళ్ల లయన్స్ సేవలందించిన మంతెన రవి వర్మ, మంతెన ఆంజనేయరాజును అభినందించి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సమావేశంలో ఆర్‌విఎస్.సూర్యనారాయణరాజు, ఎం.శ్రీహరిరాజు, గీతాజాక్షన్, జిఎంఎ పాపారావు నాయుడు, లయన్స్ క్లబ్ సెక్రటరీ రామ్మోహన్‌రావు, ట్రెజరర్ కనగర్ల మధుసూదనరావు, లయన్స్ క్లబ్ సభ్యులు కతారి లక్ష్మీపతి రాజు, దాట్ల శ్రీనివాసరాజు, మంతెన హిమదుర్గ, మంతెన ఉమా శ్రీలక్ష్మి, గోపిశెట్టి కృష్ణారావు పాల్గొన్నారు. అనంతరం ఏలూరుపాడు లయన్స్ క్లబ్, మంతెన వెంకట సూర్యనారాయణ రాజు సుభద్రయమ్మ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో 70 వేల రూపాయల విలువైన కంప్యూటర్, మోనిటర్, ప్రింటర్‌ను తహశీల్దార్ కార్యాలయానికి ట్రస్ట్, లయన్స్ క్లబ్ అధ్యక్షులు మంతెన వెంకట రవివర్మ చేతుల మీదుగా అందజేశారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

ప్రజాశక్తి - ఆచంట

రైతుకు వ్యవసాయాన్ని లాభసాటిగా చేయడమే ప్రభుత్వ ధ్యేయమని సర్పంచి కోట సరోజినీ వెంకటేశ్వరరావు అన్నారు. ఆచంట మృత్యుంజయ సొసైటీ కార్యాలయం, బాలవారిపాలెం శేషమ్మచెరువు, పెనుమంచిలి గ్రామాల్లో గురువారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దళారీ వ్యవస్థను నిర్మూలించి పారదర్శకంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియను నిర్వహిస్తున్నామన్నారు. రైతులను దళారులు, మిల్లర్ల మోసాలకు గురి చేయకుండా రైతు భరోసా కేంద్రాల ఏర్పాటు వల్ల అన్ని విధాల భరోసా ఏర్పడిందన్నారు. పంటను ప్రభుత్వం నిర్ణయించిన గిట్టుబాటు ధరకు అమ్ముకునేలా చేయడమే ఈ కేంద్రాల ముఖ్యోద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఛైర్‌పర్సన్ వైట్ల శారదాదేవి, పర్సన్స్ పెచ్చెట్టి సత్యనారాయణ, మండే శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆధార్ నమోదు కేంద్రాలను వినియోగించుకోండి

గణపవరం: గ్రామ సచివాలయం వద్ద నూతనంగా ఏర్పాటు చేస్తున్న ఆధార్ నమోదు కేంద్రాలను స్థానికులు ఉపయోగించుకోవాలని తహశీల్దార్ పమ్మి లక్ష్మి తెలిపారు. గురువారం అర్ధవరం సచివాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో 20 సచివాలయాలకు ఐదు సచివాలయాల వద్ద ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆధార్ కార్డుల కోసం దూరంగా వెళ్లకుండా సచివాలయాల వద్ద ఏర్పాటు చేయడం వల్ల స్థానికులకు పనులు సులభం అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షులు దండు వెంకటరామరాజు (అర్ధవరం రాము) ఎంపిడిఒ జి.జ్యోతిర్మయి, గ్రామ సర్పంచి గాతల సుజాత ఉప సర్పంచి భాస్కరరాజు పాల్గొన్నారు.

ఆక్వా రైతులకు ముఖ్యమంత్రి అండ : ఎంఎల్ఎ

భీమవరం రూరల్: ఆక్వా రైతులను అన్ని విధాలా ఆదుకుంది ముఖ్యమంత్రి జగనేనని ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. గురువారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎఫ్‌డిఒ లావణ్యతో మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పది ఎకరాల్లోపు ఆక్వా సాగు చేసే ప్రతి రైతుకు కూడా విద్యుత్ సబ్సిడీగా యూనిట్ రూపాయిన్నరకే ప్రభుత్వం అందిస్తోందన్నారు. ఐదెకరాల్లోపు రైతులకు మాత్రమే విద్యుత్ సబ్సిడీ వర్తిస్తున్న నేపథ్యంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ నేపథ్యంలో సబ్సిడీని ఐదు నుంచి పదెకరాల వరకూ పెంచారని, దీనివల్ల 90 శాతం మంది రైతులకు మేలు జరిగిందని తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

'ఆసరా' కోసం నిరీక్షణ..!

15 రోజులైనా అందని సొమ్ము

డ్వాక్రా మహిళలకు తప్పని తిప్పలు

విఒఎల నిర్లక్ష్యమే ప్రధాన కారణమంటున్న సభ్యులు

ప్రజాశక్తి - పాలకోడేరు

ఎన్నికల హామీలో భాగంగా స్వయం సహాయక సంఘాలకు వైసిపి ప్రభుత్వం డ్వాక్రా రుణమాఫీ అందజేస్తోంది. 'ఆసరా' పేరుతో నాలుగు విడతల్లో రుణమాఫీ విడుదల చేస్తానన్న ప్రభుత్వం ఇటీవల మూడో విడత ఆసరా ఆర్థిక సాయం విడుదల చేసింది. మండల కేంద్రం పాలకోడేరులో ఈ నెల 4న ఏర్పాటు చేసిన బహిరంగ సభలో నాయకులు మహిళా సంఘాలకు 'ఆసరా' నమూనా చెక్కును అందజేశారు. ఆసరా నగదు కోసం ఎదురు చూస్తున్న స్వయం సహాయక సంఘాల మహిళలకు రోజులు గడుస్తున్నా సాయం అందకపోవడంతో వారంతా నిత్యం బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

కోరుకొల్లు ఆంధ్రాబ్యాంక్

మండలంలోని 14 గ్రామాల్లో మొత్తం 1,293 స్వయం సహాయక సంఘాలకు మూడో విడత రుణమాఫీ కింద రూ.14.25 కోట్లు నగదు విడులైంది. ఈ మొత్తం గ్రామ సమాఖ్యల ఖాతాల్లో జమైంది. తిరిగి ఈ మొత్తం స్వయం సహాయక సంఘాల ఖాతాలకు అక్కడ నుంచి సభ్యుల వ్యక్తిగత ఖాతాల్లోకి నగదు జమ చేయాలంటే బృందం సభ్యులంతా తమ అంగీకారం తెలుపుతూ సంతకాలు చేసిన దరఖాస్తును సంబంధిత బ్యాంకు మేనేజర్లకు అందజేయాలి. సదరు దరఖాస్తులు కొన్ని బ్యాంకుల వద్ద లేకపోవడం, స్థానికంగా ఉన్న విఒఎలు దరఖాస్తులను స్వయం సహాయక సంఘాల బృందాలకు అందజేయకపోవడంతో ఇబ్బంది తలెత్తింది. మిగిలిన గ్రామాలతో పోల్చితే కోరుకొల్లులోని ఒక బ్యాంకు పరిధిలోని సంఘాల సభ్యులు తమకు ఆసరా సాయం ఇంకా జమకాలేదని వాపోతున్నారు. కొందరు సభ్యులు మాత్రం సంతకాలు చేసిన దరఖాస్తులను విఒఎలకు ఇచ్చామని వారి నిర్లక్ష్యం కారణంగా తమకు నగదు ఇంకా జమకాలేదని వాపోతున్నారు. కొందరు విఒఎలు మామూళ్ల కోసమే దరఖాస్తులను సంఘాల సభ్యులకు ఇవ్వడం లేదని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై వెలుగు ఎపిఎం యు.రవికుమార్‌ను వివరణకోరగా అవగాహన లేకపోవడమే దీనికి కారణం అన్నారు. స్వయం సహాయక సంఘాల బృందాల సభ్యులు నేరుగా బ్యాంకులకు వెళ్లి వారి వ్యక్తిగత ఖాతాల్లో నగదు జమ చేయించుకోవచ్చని పేర్కొన్నారు. సభ్యులకు వీటిపై అవగాహన కల్పించకపోవడం వల్ల సమస్య తలెత్తిందని తెలిపారు. విఒఎలతో మాట్లాడి వీలైనంత వేగంగా సమస్యను పరిష్కరిస్తానని వెల్లడించారు.

రోడ్డు నిర్మించాలని అర్ధనగ్న ప్రదర్శన

ప్రజాశక్తి - తణుకు రూరల్

వేల్పూరు నుంచి గుమ్మంపాడు రహదారిని శాశ్వత ప్రాతిపదికన నిర్మించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అధ్వానంగా మారిన ఈ రహదారి పనులను తక్షణం చేపట్టాలని కోరుతూ రోడ్డుపై కొద్దిసేపు అర్ధనగ్నంగా మోకాళ్లపై నిలబడి వీరభద్రరావు వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వీరభద్రరావు మాట్లాడుతూ వేల్పూరు నుంచి మండపాక వరకూ, మండపాక నుంచి గుమ్మంపాడు వెళ్లే ఎడ్ల పందేల పుంత రహదారి పెద్ద పెద్ద గోతులు ఏర్పడడంతో పాటు రాళ్లు పైకి లేచిపోయాయని, ఈ రహదారిపై ప్రయాణం చేయాలంటే వాహనదారులకు నరకప్రాయంగా తయారైందని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రోడ్డు నిర్మాణ పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని వీరభద్రరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

మోకాళ్లపై నిలబడి అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న చిన వీరభద్రరావు

ఘనంగా చంద్రబాబు పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు 73వ పుట్టినరోజును పురస్కరించుకుని గురువారం పట్టణంలో పలుసేవా కార్యక్రమాలు నిర్వహించారు. భీమవరం పాత బస్టాండ్ అన్నా క్యాంటీన్ వద్ద టిడిపి అంగన్వాడీ డ్వాక్రా సంఘాల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెరగాని నారాయణమ్మ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి ఆధ్వర్యంలో పులిహోర, మజ్జిగ ప్యాకెట్లు, ఆర్‌బిఎస్ రాష్ట్ర యువజన విభాగ అధ్యక్షుడు చెరుకుపల్లి సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో పండ్లు పంపిణీచేశారు. రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి మాట్లాడుతూ కష్టించి పనిచేసే మనస్తత్వం ఉన్న చంద్రబాబుకు మనమంతా అండగా ఉండాలన్నారు. టిడిపి అగ్రనాయకులను సన్మానించి 500 మంది పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రేవు వెంకన్న, కౌరు పృథ్వీశంకర్, బొడ్డు మోహన్, మాదాసు కనకదుర్గ పాల్గొన్నారు.

ఉండి : చంద్రబాబు నాయుడు పుట్టినరోజు వేడుకలు టిడిపి మండల అధ్యక్షులు కరిమెరక నాగరాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంఎల్ఎ మంతెన రామరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు పొత్తూరి వెంకటేశ్వరరాజు, కాగిత మహంకాళి, మోపిదేవి శ్రీనివాస్, కునుకు శ్రీనివాస్ మాట్లాడారు. అనంతరం ఎంఎల్ఎ రామరాజు మాట్లాడారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు కాగిత బుజ్జి, మండల ఉపాధ్యక్షులు పేరిచర్ల కృష్ణంరాజు, ప్రధాన కార్యదర్శి కిన్నెర వెంకన్న, కన్నెగంటి రూత్ కళ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాళ్ల : టిడిపి ఉన్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంఎల్ఎ మంతెన రామరాజు పిలుపునిచ్చారు. కాళ్లలో చంద్రబాబు నాయుడు పుట్టినరోజు వేడుకలను పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ముందుగా నేతలు పార్టీ జెండాను ఆవిష్కరించి, ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు జివి.నాగేశ్వరరావు, మాజీ డిసి ఛైర్మన్ తోటఫణి బాబు, సీనియర్ నాయకులు పొత్తూరి వెంకటేశ్వరరాజు పాల్గొన్నారు.

పాలకొల్లు : పట్టణంలోని అద్దేపల్లివారి సత్రంలో జరిగిన చంద్రబాబు పుట్టినరోజు వేడుకలు

ఆకివీడు: చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎంఎల్ఎ

ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పితాని సత్యనారాయణ మాట్లాడారు. కోడికత్తి కేసు నాటకమన్నారు. బిజెపికి రాష్ట్రంలో ఒక ఎజెండా లేకున్నా అధికారంలోకి రావాలని చూస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు, ఎంఎల్‌సి అంగర రామ్మోహన్, పరిశీలకులు చంద్రమౌళి, నరసాపురం నేతలు పొత్తూరి రామరాజు కొవ్వలి యతిరాజు, కర్నేన గౌరు నాయుడు పాల్గొన్నారు.

ఆకివీడు : రానున్న ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి రావడానికి కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని ఎంఎల్ఎ మంతెన రామరాజు పిలుపునిచ్చారు. చంద్రబాబు నాయుడు పుట్టినరోజు, లోకేష్ వెయ్యి కిలో మీటర్లు పాదయాత్ర పూర్తి చేసిన సందర్భంగా పార్టీ కార్యాలయంలో మండల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు మోటుపల్లి ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సభలో ఎంఎల్ఎ మాట్లాడారు. నియోజకవర్గంలో త్వరలో అన్నా క్యాంటీన్లు ప్రారంభిద్దామన్నారు. అనంతరం కేకు కట్ చేసి, లోకేష్, చంద్రబాబు చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి ఎస్.రామారావు పట్టణ అధ్యక్ష కార్యదర్శులు బొల్లా వెంకట్రావు గంధం ఉమా సత్యనారాయణ, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

తణుకు : చంద్రబాబు నాయుడు పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మున్సిపల్ కార్మికులకు చీరలు, ప్రభుత్వాసుపత్రిలోని బాలింతలు, గర్భిణులకు పండ్లు పంపిణీ చేశారు. సంధ్య జ్యోతి ఆశ్రమంలోని వృద్ధులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఎ ముళ్లపూడి వెంకట కృష్ణారావు, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ దొమ్మేటి వెంకట సుధాకర్ పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : చంద్రబాబు పుట్టినరోజు సందర్భంగా టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల మల్లికార్జునరావు (బాబ్జి) ఆధ్వర్యంలో గురువారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. గొర్రెల లక్ష్మీనారాయణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రాన్ని బాబ్జి ప్రారంభించారు. శేషామహల్ రోడ్డు, ఎన్‌టిఆర్ చౌక్ వద్ద ఎన్ఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి వంద మంది పేదలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. అలాగే ప్రభుత్వాసుపత్రిలోని రోగులకు బ్రేడ్, పండ్లు అందజేశారు. ఉన్నమట్ల రాజేష్ ఆధ్వర్యంలో అన్నాక్యాంటీన్ వద్ద అన్నదాం చేశారు. గొర్రెల శ్రీధర్ ఆధ్వర్యంలో కొండయ్య చెరువువద్ద ఉన్న లార్ధాఫ్ చిల్డ్రన్స్ ఆశ్రమం వద్ద అన్నదానం చేశారు. కార్యక్రమంలో పెంటపాడు మండల అధ్యక్షులు కిలపర్తి వెంకట్రావు, రూరల్ మండల అధ్యక్షులు పరిమి రవికుమార్ పాల్గొన్నారు.

ఆచంట : బిజెపిది ద్వంద్వ వైఖరి అని మాజీ మంత్రి పితాని సత్యనారాయణ విమర్శించారు. చంద్రబాబు నాయుడు పుట్టినరోజు వేడుకలు ఆచంటలో ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. ముందుగా ఎన్‌టిఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పితాని మాట్లాడుతూ రాష్ట్రంలో సిపిఎం, సిపిఐ ఒక స్పష్టతతో ముందుకెళ్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు బాధ్యతలు చేపట్టి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించి, భావితరాల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తారన్నారు. కార్యక్రమంలో ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి, జెడ్‌పిటిసి ఉప్పలపాటి సురేష్‌బాబు, మండల అధ్యక్షులు కేతా మీరయ్య, నాయకులు పాల్గొన్నారు.

మొగల్తూరు : మొగల్తూరులోని గాంధీ బొమ్మ సెంటర్, కోటప్రాంతం, నవుడూరు వారి గరువులో చంద్రబాబు పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, కొవ్వలి యతిరాజు రామ్మోహన్ నాయుడు కేక్ కట్ చేశారు.

జెసి ఆకస్మిక తనిఖీలు

పాలకొల్లు రూరల్: మండలంలోని శివదేవునిచిక్కాలలో రైతుభరోసా కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడతూ ధాన్యం కొనుగోలులో రైతులకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా సకాలంలో గోనె సంచులు అందించాలన్నారు. ఆర్‌బికె సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. ఇంతవరకూ ఎంత మంది రైతులు వచ్చారు, ఎంత ధాన్యం కొనుగోలు చేశారని జెసి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ సంగాని వెంకటేశ్వరరావు, వ్యవసాయాధికారి అబ్దుల్ రహీం తదితరులు పాల్గొన్నారు.

దగ్గులూరులోని జగనన్న లేఅవుట్‌ను జెసి ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇక్కడ మొత్తం 74 ఇళ్లు మంజూరవ్వగా 31 పూర్తయ్యాయని, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయని హౌసింగ్ అధికారులు జెసికి వివరించారు. ఈ నెలాఖరుకు మిగిలిన ఇళ్ల నిర్మాణంలో పురోగతి చూపాలని జెసి ఆదేశించారు. లేఅవుట్ల్లో మౌలిక సదుపాయాలు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. జెసి వెంట సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ, తహశీల్దారు సిహెచ్.పెద్దిరాజు, ఎంపిడిఒ సంగాని వెంకటేశ్వరరావు, వ్యవసాయ శాఖాధికారి ఎస్.అబ్దుల్‌రహీమ్ పాల్గొన్నారు.

లోఓల్టేజీ సమస్యను పరిష్కరించాలి

విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ముట్టడించిన దొడ్డనపూడి గ్రామస్తులు

ప్రజాశక్తి - కాళ్ల

దొడ్డనపూడి గ్రామంలో విద్యుత్ శాఖ అధికారులు లోఓల్టేజీ సమస్యను పరిష్కరించకుంటే గ్రామస్తులతో కలిసి ఉద్యమిస్తామని ఎంఎల్ఎ మంతెన రామరాజు తెలిపారు. లోఓల్టేజీ సమస్యను పరిష్కరించాలంటూ దొడ్డనపూడి గ్రామస్తులు కాళ్ల విద్యుత్ సబ్ స్టేషన్‌ను గురువారం మధ్యాహ్నం ముట్టడించారు. సుమారు మూడు గంటలపాటు ఎండలో ఆందోళన చేపట్టారు. దొడ్డనపూడిలో అధికార పార్టీకి చెందిన నాయకుడు, రైతు చేపల చెరువు సమీపంలో ఇరిగేషన్ కాల్వగట్టుపై విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. తన చెరువు సమీపంలో ఏర్పాటు చేశారనే ఉద్దేశంతో దానికి సంబంధించిన విద్యుత్ స్తంభాన్ని 15 రోజుల క్రితం రైతు విరగ్గొట్టాడు. విద్యుత్ స్తంభాన్ని విరగొట్టడంతో ట్రాన్స్‌ఫార్మర్‌కు విద్యుత్ కనెక్షన్ ఇవ్వడానికి అవకాశం లేకుండా పోయింది. దీంతో గ్రామస్తులు పది రోజుల క్రితం విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేయాలని స్పందనలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. విద్యుత్ శాఖ అధికారులు, సర్వే సిబ్బంది, విఆర్ఒ ఆ ప్రాంతాన్ని ఇటీవల పరిశీలించారు. విద్యుత్ స్తంభం ఉన్న స్థలం ప్రభుత్వానిదా, కాదా అనేది నిర్ధారించాలని రెవెన్యూ అధికారులను గ్రామస్తులు కోరారు. ఓ పక్క ఎండ తీవ్రత , మరో వైపు లోఓల్టేజ్ సమస్యతో నానా అవస్థలు

సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న దొడ్డనపూడి గ్రామస్తులు

పడుతున్నామని వాపోయారు. అధికారులు పరిశీలించి వెళ్లినా సమస్య పరిష్కారం కాకపోవడంతో సబ్‌స్టేషన్‌ను ముట్టడించామని తెలిపారు. స్తంభాన్ని విరగొట్టిన అధికార పార్టీ నాయకుడిపై చర్యలు తీసుకోవాలని, సమస్యను పరిష్కరించాలని కోరారు. దీనిపై ఎంఎల్ఎ మంతెన రామరాజు గ్రామస్తులు, అధికారులతో మాట్లాడారు. శుక్రవారం సాయంత్రానికి సమస్య పరిష్కారం కాకపోతే గ్రామస్తులతో కలిసి తాను కూడా నిరసన తెలుపుతానని తెలిపారు. అనంతరం విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో ఆయన ఫోన్లో మాట్లాడారు. అనంతరం గ్రామస్తులు ఎలక్ట్రికల్ ఎఇ పి.రాంబాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు జివి.నాగేశ్వరరావు, మాజీ ఎంపిపి ఆరేటి వెంకటరత్న ప్రసాద్, ఎఎంసి మాజీ డైరెక్టర్ ఆరేటి సుజాత, కొల్లి వెంకట రామారావు, కొల్లి పేరయ్య, ఇర్రింకి వెంకటేశ్వరరావు, మహిళలు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు : మంత్రి కొట్టు

తాడేపల్లిగూడెం: తాగునీటి సరఫరాలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ మున్సిపల్ అధికారులను హెచ్చరించారు. స్థానిక పంపులచెరువు వద్ద గురువారం ఆయన తాగునీటి సరఫరాపై సమీక్షించారు. ముందుగా పంపుల చెరువులో నీటి నిల్వలను పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న ఫిల్టర్‌బెడ్‌ల పనుల ప్రగతిపై ఆరా తీశారు. వార్డుల వారీగా తాగునీటి సరఫరాపై సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వెనుక మూడు కోట్ల 65 లక్షల రూపాయలు వ్యయంతో రిజర్వాయర్ నిర్మిస్తున్నామన్నారు. పంపుల చెరువు ఆవరణలో రూ.5.65 కోట్లతో రోజుకు 11 మిలియన్ లీటర్లు నీటిని శుద్ధి చేసే ఫిల్టర్ ప్లాంట్ నిర్మాణ పనులు ప్రగతిలో ఉన్నాయన్నారు. ఇది పూర్తయితే పట్టణంలో అదనంగా మరో రెండు రిజర్వాయర్లు నిర్మించుకునే అవకాశం ఉందన్నారు. తాగునీటి సరఫరాకు సంబంధించి పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు చేయడంలో మున్సిపల్ కమిషనర్ ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పనులు చేసిన కాంట్రాక్టర్లు బిల్లులు చేయించుకోవడానికి మీ ఆఫీస్ చుట్టూ మీ చుట్టూ తిరగాల్సిన పరిస్థితి రాకూడదన్నారు. పనితీరు మారని పక్షంలో మున్సిపల్ ఆఫీసంతా సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ బి.బాలస్వామి మున్సిపల్, ఇంజినీర్ డి.మురళీకృష్ణ, డిఇ కుబియా నాయక్, మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ కర్రి భాస్కరరావు, మాజీ జెడ్‌పిటిసి ముప్పిడి సంపత్ కుమార్ పాల్గొన్నారు.

సామాజిక చైతన్య పాదయాత్రకు స్పందన

ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు

పాలకొల్లు: దళిత, బలహీన వర్గాలపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ నియోజకవర్గంలో గురువారం సామాజిక చైతన్య పాదయాత్ర చేపట్టారు. చంద్రబాబు పుట్టినరోజును పురస్కరించుకొని ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు పాలకొల్లు నుండి నరసాపురం సబ్ కలెక్టర్ ఆఫీస్ వరకూ మండుటెండలో 13 కిలోమీటర్లు సామాజిక చైతన్య పాదయాత్ర నిర్వహించారు. అనంతరం సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ముందుగా అద్దేపల్లి వారి సత్రం వద్ద చంద్రబాబు పుట్టినరోజు సేవా కార్యక్రమాల్లో భాగంగా పేద చిరు వ్యాపారులకు బండ్లు, చేతివృత్తుల వారికి ఇస్త్రీ బండ్లు ఉచితంగా అందచేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి అంగర రామ్మోహన్, మాజీ మంత్రి పితాని సత్యనారాయణ పాల్గొన్నారు. అనంతరం నిమ్మల మాట్లాడుతూ దళిత, బిసి ద్రోహిగా జగన్మోహన్ రెడ్డి నిలిచిపోతారన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం

పోడూరు: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పెదపాటి పెద్దిరాజు అన్నారు. గురువారం అప్పన్నచెరువు శివారు సబ్బేవారిపేట గ్రామంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పెద్ది రాజు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు ఇంటింటికీ వెళ్లి ప్రజల అభిప్రాయాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎన్.మూర్తి, పెదపాటి శ్రీను, కుసుమే రత్నం పాల్గొన్నారు.

ఉపాధి చూపాలని వినతి

పెనుగొండ: కార్యదర్శి షేక్ బాదుషా నిర్వహించారు గురువారం పంచాయతీ కార్యదర్శికి ఉపాధి హామీ పనులు కల్పించాలని జివివి నరసింహమూర్తి వినత పత్రం అందించారు పంచాయతీ కార్యదర్శి మాట్లాడుతూ ఉపాధి హామీ పనులు సోమవారం నుండి కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో నాగిశెట్టి గంగారావు, గెద్దాడ శ్రీను, మహిళలు పాల్గొన్నారు

ముత్యాలపల్లిలో అన్నదానం

మొగల్తూరు: ముత్యాలపల్లిలోని మరిడి మహాలక్ష్మి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో గురువారం రాత్రి భారీ అన్న సమారాధన నిర్వహించారు. బండి ముత్యాలమ్మ అమ్మవారి ఉపాలయమైన మరిడి మహాలక్ష్మమ్మ జాతర మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన అన్న సమారాధనలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

ఎమర్జన్సీ సర్టిఫికెట్ (EC) పోయినది

MYLA AMMANNA అను నాకు KUWAIT రాయభార కార్యాలయం అధికారులు ది. 28-07-2019న **X0829747** నెంబరు గల ఎమర్జన్సీ సర్టిఫికెట్ (EC) మంజూరు చేసారు. సదరు EC జిరాక్సు కాపీలు తీయించుకునేందుకు మా ఇంటి నుండి నరసాపురం పట్టణం వెళుతున్న సమయంలో నా ఒరిజినల్ EC పోయినది. గాన, నా ఎమర్జన్సీ సర్టిఫికెట్ (EC) ఎవరికైనా దొరికిన ఎడల ఈక్రింది చిరునామాకు అందించగలరని కోరుతున్నాను.

MYLA AMMANNA
S/o. Myla Vanama Raju
D.No. 5-16, Chinamainavani Lanka
Vemuladeevi, West Post
Narasapuram Mandal, W.G.Dt., A.P.,

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

I.A.No. 702/2022
in I.A.No. 703/2022
in I.A.No. 704/2022
in O.S.No. 47/2014

Between:
Sri Lakkakula Satyanarayana (Died) and others ***...Petitioners /Plaintiffs***
AND
Sri Lakkakula Suryachandra Rao and others ***...Respondents /Defendants***
Sri Lakkakula Durga Prasad
Smt Moghala Neelima
...Respondents /Proposed Parties at 10 and 11 Defendants
Respondents /Proposed Parties at 10 and 11 Defendants
10th Respondent /10th Defendant:
Sri Lakkakula Durga Prasad, S/o. Jagadeeswara Narayana, 30 Yrs, Hindu, Male, Private Employee, Madhavaram, Tadepalliguedm Mandal, TPG SCJC.
11th Respondent /11th Defendant:
Smt. Moghala Neelima, W/o. Chandra sekhar, D/o. Jagadeeswara Narayana, 25 Years, Hindu, Female, HouseWife, Gurralavari Street, Co-Operative Bank, Penugonda, Tanuku SCJC.

పై నెంబరు పిటీషనులో /దావాలో మీపై పిటీషనర్లు /వాదులు పిటీషను /దావా దాఖలు చేసిన దర్మిలా 2వ రెస్పాండెంటు /2వ ప్రతివాది చనిపోయిన దర్మిలా 10, 11 రెస్పాండెంట్లు /ప్రతివాదులు అయిన మిమ్మల్ని వారసులు /పార్టీలుగా చేర్చమని కోరుచూ మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపించి యున్నప్పటికి మీరు తీసుకొనని కారణముగా శ్రీ కోర్టు వారు పేపరు పబ్లికేషన్ ద్వారా నోటీసులు అమలు నిమిత్తం వాయిదా వేసియున్నారు. వాయిదా తేదీ **ది.24-04-2023 వ సం॥రం తేదీ అయి ఉన్నది. ఆరోజు ఉదయం గం॥ 10:30 ని॥లకు స్వయంగా గాని, వకీలు ద్వారా గాని ఆక్షేపణలు ఉన్న ఎడల తెలుపుకొనవలెను.** లేని ఎడల మీకు పరోక్షముగా తీర్మానం చెయ్యబడును.

వాయిదా తేదీ: 24-04-2023

ముద్దన శ్రీనివాసరావు
న్యాయవాది, తాడేపల్లిగూడెం.
సెల్: 99483 37320

శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానం

కాళ్ళకూరు గ్రామం, కాళ్ళ మండలం, ప॥గో॥జిల్లా. ఫోన్: 08816-245341, సెల్: 89852 44445

ఆర్.సి.సంఖ్య: 10/2023 — **షార్ట్ సీల్డు టెండర్ ప్రకటన** — తేదీ: 20-04-2023

శ్రీవేంకటేశ్వర స్వామి వారి దేవస్థానం, కాళ్ళకూరు వార్కి ఈ క్రింది తెల్పిన ఐటమ్స్‌నకు సీల్డు టెండర్ ద్వారా కోరబడుచున్నవి.

వ.నెం	వివరములు	టెండరు స్వభావం	కాలపరిమితి	ధరావత్తు సొమ్ము రూ.	టెండరు షెడ్యూల్ ఖరీదు రూ.	టెండరు షెడ్యూలు జారీ చేయు తేదీ	టెండరు దాఖలు చేయుటకు ఆఖరు తేదీ సమయం	టెండరు తెరచు తేదీ సమయం
1	కళ్యాణోత్సవములు సందర్భంగా కళ్యాణం వద్ద విద్యుత్ మెరుపులు ప్రదర్శన (లేజర్ షో)	సీల్డు టెండరు	ది.01-05-2023 తేదీ రాత్రి గం.7:00లకు విద్యుత్ మెరుపుల ప్రదర్శన	1000/-	100/-	21-04-23 నుండి	28-04-23 ఉదయం 10:00 గం॥ల వరకు	28-04-23 ఉదయం 10:30 గం॥ల వరకు
2	కళ్యాణోత్సవములు సందర్భంగా రథోత్సవంలో విద్యుత్ మెరుపులు ప్రదర్శన (లేజర్ షో)	సీల్డు టెండరు	ది.05-05-2023 తేదీ రాత్రి గం.5:00లకు విద్యుత్ మెరుపుల ప్రదర్శన	1000/-	100/-	21-04-23 నుండి	28-04-23 ఉదయం 10:00 గం॥ల వరకు	28-04-23 ఉదయం 10:30 గం॥ల వరకు

ఇతర వివరములకు దేవాలయ కార్యాలయం పని వేళల యందు సంప్రదించగలరు.
కాళ్ళకూరు,
ది.20-04-2023.
శ్రీ స్వామి వారి సేవలో
ఛైర్మన్ /ధర్మకర్తల మండలి, కార్యనిర్వహణాధికారి